# పద ప్రయోగ ప్రకరణం

## 1వ అధ్యాయం -కాలాన్ని నిందించరాదు

1449. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ఉద్బోధించారు:- దేవుడు ఈ విధంగా చెబుతున్నాడు - "ఆదం సంతానం (మానవులు) కాలాన్ని దూషిస్తూ నాకు బాధ కలిగిస్తున్నారు. నిజానికి కాలం కూడా నేనే. సమస్త వ్యవహారాలకు సంబంధించిన అధికారాలు నా చేతిలోనే ఉన్నాయి. నేనే రాత్రిని, పగటిని ఒకదాని వెనుక మరొకటి వచ్చేలా తిప్పుతున్నాను."[1]

**(సహీహ్ బుఖారీ:- 65వ ప్రకరణం - తఫ్సీర్, 45వ సూరా అల్‌జాసియా, 1వ అధ్యాయం (వమా యుహ్లికునా ఇల్లద్దహ్ర్)**

## 2వ అధ్యాయం - ద్రాక్షను 'కరమ్' అని అనకూడదు

1450. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ఉపదేశించారు:- ప్రజలు ద్రాక్ష తీగను "కరమ్" అంటున్నారు. నిజానికి విశ్వాసి (ముస్లిం) హృదయమే కరమ్.[2]

**(సహీహ్ బుఖారీ:- 78వ ప్రకరణం - అదబ్, 102వ అధ్యాయం - ఖౌలిన్నబియ్యి (సల్లం) ఇన్నమల్ కరము ఖల్బుల్ మోమిన్)**

## 3వ అధ్యాయం - అబ్ద్, అమత, వకాలా, సయ్యిద్ వగైరా పద ప్రయోగాలు

1451. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా బోధించారు:- ఏ ఒక్కరూ (తన సేవకుడితో) "నీ ప్రభువుకు అన్నం వడ్డించు, నీ ప్రభువుకు వుజూ చేయించు లేక నీ ప్రభువుకు నీళ్ళు త్రాగించు" అని చెప్పకూడదు. దానికి బదులు "మీ నాయకునికి లేక మీ యజమానికి వడ్డించు, వుజూ చేయించు, నీరు త్రాగించు" అని చెప్పాలి. అలాగే ఏ ఒక్కరూ తమ (సేవకునితో లేక సేవకురాలితో) నా దాసుడా! నా దాసీ! అని సంబోధించరాదు. దానికి బదులు నా బాలుడా లేక నా బాలికా లేక నా సేవకుడా అని సంబోధించాలి.

**(సహీహ్ బుఖారీ:- 49వ ప్రకరణం - ఇత్క్, 17వ అధ్యాయం - కరాహియతి తతావులి అలర్రఖీఖ్)**

---

(1) ఏ విషయాల కారణంగా మానవుడు కాలాన్ని దూషిస్తున్నాడో ఆ విషయాలు సంభవించడానికి మూల కారకుడు దేవుడు మాత్రమే. అందువల్ల మానవుడు కాలం పేరుతో వాస్తవానికి దేవుడ్నే దూషిస్తున్నాడని ఈ హదీసు భావం. (అనువాదకుడు)

(2) పూర్వం అరబ్బులు ద్రాక్ష పండ్లను, ద్రాక్ష తీగను, ద్రాక్ష సారాయిని 'కరమ్' అనేవారు. 'కరమ్' అంటే పెద్దరికం, గౌరవం, దయ అని అర్థాలున్నాయి. ద్రాక్ష సారా సేవించడం వల్ల మనిషికి ఈ గుణాలు అబ్బుతాయని వారు భావించేవారు. కాని ఇదొక మూఢనమ్మకం. మద్య నిషేధం గురించిన దైవాజ్ఞ అవతరించిన తరువాత ద్రాక్షను 'కరమ్' అని పిలువ కూడదని దైవ ప్రవక్త (సల్లం) అన్నారు. (అనువాదకుడు)

## 4వ అధ్యాయం - నా మనస్సు దుర్గంధ మనస్సయి పోయిందని చెప్పరాదు

1452. హజ్రత్ ఆయిషా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:- ఏ ఒక్కరూ 'నా మనస్సు దుర్గంధ భూయిష్టమయిపోయింద'ని చెప్పకూడదు. దానికి బదులు ఆ భావాన్ని స్ఫురింపజేసే మరో పదం 'నా మనస్సు పాడయి పోయింద'ని చెప్పాలి.

(సహీహ్ బుఖారీ:- 78వ ప్రకరణం - అదబ్, 100వ అధ్యాయం - లా యఖుల్ ఖబుసత్ నఫ్సీ)

1453. హజ్రత్ సహెల్ బిన్ హనీఫ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:- మీలో ఎవరూ 'నా మనస్సు దుర్గంధ భూయిష్టమయిపోయింద'ని చెప్పకూడదు. దానికి బదులు 'నా మనస్సు పాడయిపోయింద'ని చెప్పాలి.

(సహీహ్ బుఖారీ:- 78వ ప్రకరణం - అదబ్, 100వ అధ్యాయం - లా యఖుల్ ఖబుసత్ నఫ్సీ)